క్లుప్తంగా

సమగ్ర చట్టం చేయాలి

దమ్మపేట: వ్యవసాయ రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎమ్ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐపీకేఎమ్ఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ కార్మికులకు రోజువారి వేతనంగా రూ.600లు చెల్లించి, 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యంతో పాటుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుర్సం ముత్యాలరావు, తోడెం దుర్గమ్మ, పండూరి వీరబాబు, ఆదినారాయణ, కాక వెంకటేష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కలిశారు. ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో కేసీఆర్‌ను కలిసిన ఆయన.. పలు అంశాలపై చర్చించారు. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని కేసీఆర్ సూచించారని మెచ్చా తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ఎన్జీఓ భవనంలో వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చింతూరు వెంకటరావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చింతూరి వెంకటరావు మాట్లాడుతూ.. వాడబలిజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య వైద్య రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వాడబలిజల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. వాడబలిజలకు కుల సర్టిఫికెట్లు జారీ, మత్స్య సొసైటీలో ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం భవిష్యత్తులో వాడబలిజల అభివృద్ధికి కార్యాచరణపై నూతన రాష్ట్ర కమిటీ చర్చించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్, ఉపాధ్యక్షుడు గార ఆనంద్, గగ్గూరి రమణయ్య, ప్రధాన కార్యదర్శి బోడింకి చందు, కోశాధికారి బోట రమణయ్య, తోట మల్లికార్జున్ రావు, తోట నాగేశ్వరరావు, చింతూరి గాంధీ, బోడంకి మహేష్, అల్లి నాగేశ్వరరావు, బద్ది శీను, కొప్పుల మురళి, తోట ప్రశాంత్, బొల్లె నరేష్, సంకపాప గణపతి, జిల్లెడ వెంకటేష్, గార మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గుండాల: 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గుండాల ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం గుండాల ఏరియా కమిటీ కార్యదర్శి యాసారపు వెంకన్న మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల్య కిరణ్, కందగట్ల ప్రవీణ్, ఆదినారాయణ, చింత నరసన్న, బొమ్మెర లక్ష్మి, కొప్పుల రాణి, గుర్రం విజయ్ రాజు, చీమల సమ్మయ్య, ఈసం సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. సంఘం నాయకులు కాపుల రవి అధ్యక్షతన సోమవారం ఉదయం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల ఉద్దేశించి ఏజే రమేష్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, కార్మికులతో మల్టీ పర్పస్ పని విధానాన్ని తీసుకువచ్చే జీవోను రద్దు చేయాలని కోరుతూ నేడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీఐటీయూ నాయకులు నకిరికంటి నాగరాజు, పి.సంతోష్ కుమార్, పంచాయతీ కార్మికులు చెన్నకేశవులు, శ్రీనివాసు పాల్గొన్నారు.

హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు

- 2 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు
- గుంతలు తీసే పనిలో కూలీలు



ఆనందాపురంలో నర్సరీ..



గొల్లగూడెంలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌కు గుంతలు తీస్తున్న కూలీలు

అశ్వాపురం: మండలంలో 10వ విడత హరితహారంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు, ఒక్కో నర్సరీలో 10వేల మొక్కలు పెంచారు. నీడనిచ్చే, పూలు, పండ్లు వివిధ రకాల మొక్కలు పెంచగా నర్సరీల్లో 90 శాతం మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు ప్రారంభం కావడంతో జూలై మొదటి వారంలో మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యం దిశగా అడుగులు

మండలంలో హరితహారంలో రెండు లక్షలు మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించారు. 24 గ్రామ పంచాయతీల్లో నర్సరీల్లో 2.40 లక్షలు పెంచారు. సుమారుగా రెండు లక్షలకు పైగా మొక్కలు అందుబాటులో ఉంటాయి. 1 లక్ష 50 వేలు ప్లాంటేషన్‌లో మొక్కలు నాటనున్నారు. మిగిలిన మొక్కలు ప్రజలకు ఇంటింటికీ ఐదు చొప్పున మొక్కలు అందజేయనున్నారు.

ప్లాంటేషన్‌కు గుంతలు..

అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, హార్టికల్చర్ ప్లాంటేషన్‌లలో భాగంగా మొక్కలు నాటేందుకు మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో కూలీలు గుంతలు ముమ్మరంగా తీస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో గోదావరి వరదలకు గతంలో వేసిన మొక్కలు పోగా ఆ గ్రామాల్లో మళ్లీ మొక్కలు నాటేందుకు కూలీలతో గుంతలు తీయిస్తున్నారు. మొండికుంట నుంచి కల్యాణపురం వరకు మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి, మొండికుంట-భద్రాచలం రహదారి వెంబడి మొక్కలు లేని ప్రదేశాల్లో నాటేందుకు గుంతలు తీస్తున్నారు. గ్రామాల్లో గతంలో పల్లె ప్రకృతి వనాల్లో 40 శాతం వరకు మొక్కలు చనిపోవడంతో పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో గుంతలు రెండు అడుగుల చొప్పున లోతు, వెడల్పు, పొడవు తీస్తే ఉపాధి కూలీలకు ఒక్కో గుంతకు రూ.76 చెల్లిస్తున్నారు.

గుంతలు తీయిస్తున్నాం..



అవెన్యూ, కమ్యూనిటీ, హార్టికల్చర్ ప్లాంటేషన్‌లలో 1.50 లక్షలు మొక్కలు నాటడమే లక్ష్యంగా ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయిస్తున్నాం. 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో కూలీలు మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు. 24 గ్రామ పంచాయతీల్లో నర్సరీలలో మొక్కలు పెంచాం. వాటితో హరితహారం కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– వరప్రసాద్, ఎంపీడీఓ, అశ్వాపురం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డ్రమ్ములు

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిలో తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఇటీవలే అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలోని శ్రీరంగాపురం వద్ద ఉన్న విజయదుర్గ భవానీ ఆలయం వద్ద వరుస రోడ్డు ప్రమాదాలు జరగడం, ఐదుగురు మృత్యువాతకు గురవగా.. పదుల సంఖ్యలో గాయపడడం తెలిసిన సంగతే. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంపై దృష్టి సారించిన స్థానిక సీఐ.. ప్రమాదాల నివారణలో భాగంగా సోమవారం శ్రీరంగాపురం వద్ద వాహనాల వేగాన్ని నిరోధించేలా ప్రత్యేకంగా డ్రమ్ములతోపాటు బారికేడ్‌లను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా అశ్వారావుపేట-దమ్మపేట మధ్యలో కుడా బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో కూడా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనదారులు వేగంగా వెళ్లి ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దమ్మపేట: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల సోమవారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డుతోపాటు మండలపరిధిలోని నాలుగు బ్లాక్ స్పాట్‌లు, మెయిన్ బారికేడ్లను పెట్టారు. వాహనాల వేగనియంత్రణకై ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా వీటిని ఏర్పాటు చేసినట్లు అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపవద్దని తెలిపారు. స్థానిక ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ నెల 29వ తేదీన నిర్వహించే భద్రాచలం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం పట్టణంలోని డీవీ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లె కోటి అధ్యక్షతన ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసి సమావేశం జరిగింది. సమావేశంలో జేఏసీ నాయకులు ఆదివాసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వంద శాతం రిజర్వేషన్, పోడుభూముల సమస్యల పరిష్కారానికి, ఏజెన్సీ వనరుల పరిరక్షణపై వంటి సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించడంతో పాటు తీర్మాణాలు చేసుకున్నారు. వీటిలో ప్రథమంగా ఈ నెల 29న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా, ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఆందోళనలో ఆదివాసీ గిరిజనులంతా అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అడ్‌హక్ స్టీరింగ్ కమిటీ ఎన్నిక..

ఆదివాసీ గిరిజన సంఘాల జేఏసి అడ్‌హక్ స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా వాసం రామకృష్ణ దొర, అల్లెం కోటి, గొగ్గల రామకృష్ణదొర, వజ్జా నరసింహారావు, తోలెం రమేష్, పొడియం నరేందర్, సోయం సాయి పృథ్వీ, ముక్తి రాజు, పడిగ నారాయణ, కోడెం వెంకటేశ్వర్లు, సోయం సత్యనారాయణ, కుంజా వెంకటరమణ, మడి శంకర్, మడి శాంత, తెల్లం సురేష్, సోయం శుక్రం, కుంజా దుర్గ, ఊకే కృష్ణవేణి, కొమరం శ్రీను, సైదులు, కుర్సం సారయ్య, కిన్నెర వెంకన్న, వజ్జా శ్రీనులను ఎన్నుకున్నారు. సమావేశంలో తుడుందెబ్బ, గిరిజన అభ్యుదయ సంఘం, సోషల్ సర్వీసెస్ ఆధార్ సొసైటీ, ఆదివాసీ మహిళా సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టపరచాలి



బయ్యారం క్రాస్ రోడ్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీఎల్పీఓ సుధీర్ కుమార్

పినపాక: వర్షాకాలం నేపథ్యంలో డ్రెయినేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని డీఎల్పీఓ సుధీర్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని బయ్యారం క్రాస్‌రోడ్‌లోని డ్రెయినేజీని ఆయన పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రెయినేజీలో చెత్తాచెదారం లేకుండా శుభ్రపరచాలని, డ్రెయినేజీపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులకు సూచించారు. దోమలు ప్రబలకుండ పంచాయతీల్లో దోమల మందు పిచికారీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

ములకలపల్లి: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి (ఎంఏఓ) కరుణామయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వానాకాలంలో పంటలసాగు, యాజమాన్య పద్ధతులు మొదలగు అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందజేస్తామని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో చర్చిస్తారన్నారు. అన్నదాతలు ఉదయం 9 గంటలకు ములకలపల్లి రైతువేదికకు రావాల్సిందిగా సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలోని బీజీకొత్తూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంకు సుమారు రూ.2 లక్షలు మండల పరిషత్ నిధులతో భవనం మరమ్మతులు, ప్రహరీ నిర్మాణానికి సోమవారం ఎంపీపీ సుజాత శంకుస్థాపన చేశారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందటంతో మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాయంను పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, నాయకులు కమటం సురేష్, దంతాల జగదీష్, ముత్తబొయిన వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, ఈనపల్లి పవన్‌సాయి, దండి నాగేష్, నాగేంద్రబాబు, నరసింహారావు, మల్లె మోహన్, శ్రీకాంత్, ఉపేందర్, కమలాకర్ పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

బూర్గంపాడు: మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగంటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. మాజీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి, గాదె నర్సిరెడ్డి, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం..

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. సోమవారం స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎన్నికల హామీలో భాగంగా ఒకే విడతలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసేలా సీఎం నిర్ణయించడంపై కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, సత్యవరపు బాటగంగాధర్, అమర్నాథ్, కోడూరి శ్రీనివాసరావు, ఎస్‌కే బాజీ, ముళ్లగిరి కృష్ణ, మందపాటి వెంకన్న, ఎస్‌కే సర్దార్, ఎస్‌కే షరీఫ్, బాబురావు పాల్గొన్నారు.

ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ



భద్రాచలంటౌన్: విద్యార్థులతో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు, అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు సోమవారం విడుదలైన ఇంటర్ ఇంప్రూమెంట్ పరీక్ష ఫలితాలలో సత్తా చాటారు. 470 మార్కులకు గాను ఎంపీసీ విభాగంలో ఎండీ సన తపస్సుము 468, బాజీ మోక్షిత 468, నలజాల లిఖిత 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంకును కైవసం చేసుకున్నారు. అలాగే బైపీసీలో ఒంటిద్దు గ్లోరీ 440గాను 438 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు, రమేష్ బాబులు మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాలలో నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకును సాధించటంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే మొదటి స్థానం నిలబడటం సంతోషంగా ఉందన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ఇచ్చి అభినందించుటతో పాటు తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో సారపాక బ్రిలియంట్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలలో చదువుతున్న సీహెచ్ దుర్గాభవాని ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. వినాయక రిషి 450 మార్కులు, సంయుక్త 449 మార్కులు సాధించింది. అదేవిధంగా బైపీసీ విభాగంలో నాగశ్వేత 403 మార్కులు, తేజస్విని 402 మార్కులు, ఎస్డీ నేహ 398 మార్కులు సాధించి సత్తా చాటారు. ప్రతిభచూపిన విద్యార్థులను బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు సోమవారం అభినందించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



మండల అధికారులకు సూచనలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు మండల అధికారులకు సూచించారు. బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు పలు సూచనలు చేశారు. వర్షాకాలం వరదలు వచ్చే ప్రాంతాలలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డ్రెయినేజీలలో పూడికలను తొలగించాలని, తాగునీటి సరఫరాలో లీకేజీలకు మరమ్మతులు చేయాలన్నారు. గ్రామాలలో మురుగునీటి గుంటలు లేకుండా తక్షణమే వాటిని పూడ్చాలని సూచించారు. జనాభా రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ నిధులు విడుదల చేస్తుందన్నారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలను పంపించాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ సునీల్, సూపరింటెండెంట్ రవీందర్, ఏపీఓ విజయలక్ష్మి, రఘు, మాధవి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేలమట్టమైన వృక్షం



అశ్వారావుపేటరూరల్: మేజర్ జీపీ ఆఫీసు వద్ద నేలమట్టమైన భారీ వృక్షం

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం సోమవారం నేలమట్టమైంది. తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం, గాలి కారణంగా చెట్టు విరిగి ప్రధాన రహదారిపై అడ్డంగా పడింది. చెట్టు కూలిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడగా, సమీపంలోనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సైతం దెబ్బతిన్నది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని స్థానిక గ్రామ పంచాయతీ ఈఓ హరికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు.

విద్యార్థే వడ్డించేది!



తోటి విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పాఠశాల విద్యార్థి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వంట కార్మికురాలికి బదులుగా ఓ విద్యార్థి వడ్డిస్తున్నాడు. ఈ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా.. ఇదే గ్రామానికి చెందిన వంట కార్మికురాలు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేస్తోంది. కానీ వడ్డించేందుకు రావడం లేదు. దీంతో పాఠశాలలోని విద్యార్థులకు తోటి విద్యార్థే భోజనాన్ని వడ్డిస్తున్నాడు.

పాఠశాలలకు చేరిన లైబ్రరీ సామగ్రి

అశ్వారావుపేటరూరల్: పలు ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం లైబ్రరీకు సంబంధించిన సామగ్రి చేరింది. మండలంలోని తిరుమలకుంట, ఆసుపాక, నందిపాడు, వినాయకపురం, కొత్తూరు, జమ్మిగూడెం, దురదపాడుతోపాటు మరో నాలుగు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యాశాఖ ద్వారా అందించారు. వీటిలో పుస్తకాలు పెట్టేందుకు ర్యాకులు, విద్యార్థులు కుర్చేనే విధంగా టేబుళ్లు, గదుల్లో కింద వేసేందుకు కార్పెట్‌లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సామగ్రిను వాహనం ద్వారా సరఫరా చేశారు.

కలెక్టర్‌కు వినతి

గుండాల: మండలంలోని కొడవటంచ గ్రామం దగ్గర కిన్నెరసాని (ఏడు మేలికలవాగు)పై హై లెవెల్ వంతెన ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ వాగబోయిన రామక్క కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షం అధికంగా కురిస్తే ఈ గ్రామాలు జలదిగ్బంధనములో చిక్కుకుంటున్నాయని అన్నారు. ఆ సమయంలో గర్భిణులు, వృద్ధులు అనేక కష్టాలు పడుతున్నారని, ఈ సమస్యలపై వెంటనే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. దీంతోపాటు ఏడు మేకల వాగు చెక్డాం మళ్లింపు కాలువలో వేసిన ఇసుక మేటలను తొలగించాలని, కొడవటంచ గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌తోపాటు జీసీసీ రేషన్ షాపును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కోడవటంచ, పాలగూడెం, నాగారం గ్రామస్తులు పర్శక రవి, పటేల్ యానయ్య, ఈసం మల్లయ్య, వజ్జ మంగయ్య, ఈసం రమేష్, మోకాళ్ళ సుధాకర్, చీమల వసంతరావు, ఈసం ఆనంద్, చీమల నవీన్, ఈసం గోపయ్య, చీమల రామయ్య పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

చంద్రుగొండ: కొత్తగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకులు కూరాకుల నర్సింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కుదించి, కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంఘ నాయకులు ఎర్ర వెంకట్రావ్, వరికూటి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు



అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: క్రీడా పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం ఎంపికలను నిర్వహించారు. సోమవారం అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలను చేపట్టగా, ఈ కార్యక్రమాన్ని కాంప్లెక్స్ హెచ్ఎం పి.హరిత ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మండల స్థాయిలో నిర్వహించే ఈ ఎంపికలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసి పంపిస్తామన్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఎంపికలో అర్హత సాధిస్తే రాష్ట్రంలోని హకింపేటలోగల క్రీడా పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం పొందుతారని చెప్పారు. ఈ పోటీల్లో మండలం నుంచి జిల్లాకు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. పీఈటీలు కొర్రాజులు, కుమారి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సీసీఓ మహబూబ్, ఐఆర్పీలు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో పినపాక నియోజకవర్గంలో..

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మూడో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ క్రీడా పాఠశాల్లో నాలుగో తరగతి ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మణుగూరు ఎంఈఓ వీరస్వామి తెలిపారు. సోమవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మణుగూరు, పినపాక, అశ్వాపురం, కరకగూడెం మండలాల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీన కరకగూడెం, పినపాక మండలాల విద్యార్థులకు పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో, మణుగూరు మండల విద్యార్థులకు ఈ నెల 27న జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో, అశ్వాపురం మండల విద్యార్థులకు మొండికుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో జరిగే పోటీలకు ఉదయం 10గంటలలోపు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. మండల స్థాయిలో జరిగే క్రీడాపోటీలకు విద్యార్థిని, విద్యార్థులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డ్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి వయస్సు, జన్మదిన సర్టిఫికెట్, మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కుల ధ్రువీకరణ పత్రంతో రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో తమ వెంట తెచ్చుకోవాలన్నారు.